చిమ్మచీకటిలో కూడా ఓ ఆకుపచ్చని దీపం మిణుకుమంటుదనే
ఆశని... ధైర్యాన్ని చూసిన మానవ జీవన చరిత్ర కొనసాగింపు.

కుప్పిలి పద్మ

# 8 మళ్లీ తేయాకు తోటల్లోకి...





బుక్ షెల్ఫ్ పక్కనున్న కిటికీ కర్టెన్ పక్కకి జరిపి బయటకు చూస్తోంది నీలాక్షి. కనుచూపు మేరంతా దట్టమైన పొగమంచు కమ్ముకొన్నట్టు కురుస్తోన్న వాన, జోరుగా బ్రహ్మపుత్రని పరుగులెత్తిస్తూ... సజీవమైన నది పరుగు యిది, యెప్పుడూ పరుగులెడుతూనే వుంటుంది. రిక్త ఘోషతోనో, రక్తదాహంతోనో యెంత చరిత్రని తన గర్భంలో దాచుకుందో, యెన్ని వలస బతుకుల్ని తన లోతుల్లో యిముడ్చుకున్న యీ నదిది అనేక జాతుల సంవాదం. యీ నదిది అజ్ఞాత యుద్ధసంచారం.

చేతిలోని టీ కప్పు. ఫ్రెష్ టీ పరిమళం. 'వాసన తెలుస్తోంది... సో ఐ యమ్ నెగిటివ్,' అనుకొంటూ వో సిప్ చేసింది.

గొంతులోకి వెచ్చగా నిదానంగా జారుతోన్న వెచ్చదనం.

యీ వానల్లో టీ ఆకులు తడిసితడిసి యింత ఫ్రెష్‌నెస్సా... తాగుతుండగానే మూడ్‌ని యన్‌హేన్స్ చేస్తుందా?!

కిటికీకి ఆ పక్కన వున్న టేబిల్ దగ్గరకి వచ్చి కుర్చీ లాక్కుని కూర్చుని మూసుకుపోయిన లాప్‌టాప్‌ని ఆన్‌చేసి యిందాకా చదువుతూ మధ్యలో ఆపేసిన టీ యెస్టేట్స్ మీద రిపోర్ట్‌ని చదవటం మొదలు పెట్టింది. టీ ప్లాంటర్స్ బాడీ అంచనా ప్రకారం లాక్‌డౌన్‌లో అస్సామ్ యిప్పటికి 1,218 కోట్లు నష్టపోయిందని చదువుతూంటే ఆమెకి తనీమధ్య పేపర్‌కి ఫైల్ చేసిన న్యూస్ గుర్తొచ్చింది. ఆ ఐటమ్‌ని తీసింది.

టీ యెస్టేట్స్‌లో పనిచేస్తోన్న స్త్రీలు తమ వేతనాలు పెంచమని ప్లకార్డ్స్ పట్టుకొని డిమాండ్ చేస్తోన్న ఫోటోని చూస్తూ యింత లాస్ వచ్చినప్పుడు వీరి డిమాండ్‌నేం నెరవేరుస్తారు...!?

చాల రాష్ట్రాల్లో కంటే అస్సాంలో టీ ఆకులు తుంపే వారి వేతనాలు తక్కువ. యీ సారి లాక్‌డౌన్... మరోవైపు వరదలు... ఆగని వాన... అన్నింటికి మించి యెక్కడెక్కడికో పనికి వెళ్లినవాళ్లంతా యిళ్లకు చేరుకొన్నారు. వాళ్లంతా పనికోసం చూస్తున్నారు.

యిక్కడ అందరికీ పనులు లేకేగా దూరదూర ప్రాంతాలకి పనులకోసం వెళ్లారు కదా. యిప్పుడు తిరిగొచ్చిన వారందరికీ పనులెక్కడ నుంచి వస్తాయి. యీ సమయంలో వేతనాలు పెంచటం మాట

అటుంచి వున్న జీతం తగ్గించకుండా వుంటే అదే పదివేలు అనుకుంటారా?! పట్టు పడితే వీళ్లని తీసేసి కొత్తవాళ్లకి పని యిస్తారా?!! అదెలా సాధ్యం... యేమో...

వైరస్ అటాక్ సమయాల్లో ప్రజల మీదకి యేయే కొత్త పాలసీలతో చడీ చప్పుడూ లేకుండా అటాక్ చేస్తారో...!? వైరస్ సోకితే తెలియడానికి యేవో కొన్ని లక్షణాలని మొదట్లో చెప్పేవారు. అవేమో రోజురోజుకీ మారిపోతున్నాయి. ముందున్న లక్షణాల్లోకి మరికొన్ని కొత్తకొత్తవి వచ్చి చేరుతున్నాయి. అలానే పాలసీల్లో యెన్నెన్ని యాంటీ పీపుల్ మార్పులని చేస్తారో?! యీ కోణం నుంచి వొక స్టోరీ చెయ్యాలి. యిప్పుడు న్యూస్ ఐటమ్ పంపించేసి కవర్ స్టోరీకో... సెంటర్ స్ప్రెడ్‌కో ప్లాన్ చెయ్యాలి. చెయ్యడానికి ముందు ఆ స్త్రీలని కలవాలి. వాళ్లతో మాటాడితే వారి ఆలోచనలు తెలిస్తే వో స్పష్టత వస్తుంది. ఖచ్చితంగా ఆ స్త్రీలకి అన్యాయం జరగకుండా అందరూ ఆలోచింపచేసే స్టోరీ చెయ్యాలి. అప్పుడు కాస్తేనా వీరి డిమాండ్‌కి సపోర్ట్ వస్తుంది.

నీలాక్షి చూపు ఆ ఫోటో వైపు నిలిచింది.

మళ్లీ పరికించి చూసింది.

కమ్లిని...!

నీలాక్షి పెదవులపై చిన్ని నిటూర్పు.

కమ్లిని యెలా వుందో?! కాల్ చెయ్యాలి. తను ఐటమ్ ఫైల్ చెయ్యాల్సిన టైమ్ అవుతోందని తిరిగి ఐటెం కంపోజ్ చేస్తూ మరో కప్పు టీ తీసుకొని సిప్ చేస్తూ ముందు యీ ఆఫీస్ పని పూర్తి చేసి కమ్లినికి ఫోన్ చెయ్యాలనుకొంది నీలాక్షి.

* * *

కమ్లిని మనసు కురవని వొత్తయిన మబ్బులాగా బరువుగా వుంది. మూడు రాళ్ల మధ్య సన్నని పుల్లలు పెట్టి వంట చేస్తో మధ్య మధ్యలో వాకిట్లో గోడవారగా గత నాలుగు నెలలుగా కదలని చిన్ని మూడుచక్రాల సైకిల్ వానకి తడవడంలేదు కదాని చూస్తోంది. పొయ్యిలో తడిచిన పుల్లల నుంచి వస్తోన్న పొగ వల్లో, ఆమె మనసులో అస్పష్టంగా కదులుతున్న భావాలు... ఆలోచనలు కల్లోలం వల్లో కంట్లో నీటి తెర. కొంగుతో కంటి చెమ్మని తుడుచుకొని పొంగుతున్న బియ్యంలో ముక్కలుగా కోసి పెట్టుకున్న అనాస పండు, వుప్పు, కారం వేసి గరిటతో వోసారి తిప్పి, మూతపెట్టి, పొయ్యిలోకి కట్టెల్ని యెగదోసింది. పొగ తగ్గి మంట రగిలింది. యెర్రటి మంట వెలుతురుల్లో యింకా పూర్తిగా పసిదనం వీడని కమ్లిని మొఖం యెర్రగా మెరిసింది.

“నాలుగు నెలల్లో నా జీవితంలో యెన్ని మార్పులు...!? అపుడే ముసలితనం వచ్చేసినట్లనిపిస్తోంది,” అని నీలాక్షి మేడం పోయినసారి కలిసినప్పుడు అంటే...

“నీ జీవితం యేమిటి?... మీ యిల్లూ, మా యిల్లూ యీ వూరూ ఆ వూరూ యేమిటి మొత్తంగా దేశమే... మొత్తం ప్రపంచమే మారిపోయింది,” అంది నీలాక్షి మేడమ్.

పొయ్యిలో మంటని బాగా తగ్గించేసి లాంతరు వెలుతురు పెద్దది చేసి గోడ వారగా వున్న ‘మక్రీ’ని చేతుల్లోకి తీసుకొని పల్చని వెదురు పేళ్లతో పెద్ద కంతలు పడినచోట బాగుచేయడం మొదలుపెట్టింది.

‘యీ మక్రీ మూలన పడి యెన్నాళ్లయింది?! ఆ సైకిల్‌లాగే...?’ మళ్లీ కమ్లీ కంట్లో నీటితెర... తుడుచుకుని మళ్లీ పనిలో పడింది. మనసు మాత్రం కల్లోలంగానే వుంది.

రేపు యేమవుతోంది?

* * *

కమ్లిని వూహ తెలిసినప్పటి నుంచీ శివగంగ టీ తోటల్లోనే పెరిగింది. ఐ.టి.సి. టీ తోటల చుట్టూ, చిన్న చిన్న ప్రైవేట్ కంపెనీల టీ యెస్టేట్‌లు. వాటిలో పనిచేసే కార్మికుల కోసం బారులు తీరిన రేకుల షెడ్లు, పదడుగుల గదిలో వొక్కో కుటుంబం నివాసం. ఐ.టి.సి. వాళ్లయితే క్వార్టర్లు యిస్తారు. రేకుకప్పుల యిల్లే అయినా వసతు లుంటాయి. ఐ.టి.సి.లో వుద్యోగం వేయించుకోవాలంటే మేస్త్రీలకు పెద్ద మొత్తంలో డబ్బులిచ్చుకోవాలి. శివగంగ తూరుపు కొండవాలులోని వో చిన్న ప్రైవేట్ యెస్టేట్‌లో కమ్లిని అమ్మా నాన్న, అక్కలు పని చేసేవారు. యేడాదంతా పనుండదు. టీ కోతలప్పుడే పనుంటుంది. అప్పుడు దూరపు గ్రామాల నుంచి లేబర్ కూడా వచ్చి పనులు చేసు కుంటారు. యిక్కడున్న పర్మినెంట్ లేబర్‌కి వొక రేటు, పనులున్నప్పుడు వచ్చే తాత్కాలిక కూలీలకు వొక రేటు వుంటుంది. వేకువజామున మంచు తడి ఆరక ముందే తేయాకు కోతకు దిగుతారు, తలకి మక్రీలు వేలాడేసుకొని. యెక్కడ కోయాలో ముందు రోజే మేస్త్రీ, మేనేజర్ చెప్తాడు. అందరూ అక్కడికి చేరుకొని ఐదు అడుగులు యెత్తు మించని టీ మొక్కల చుట్టూ చేరి నైపుణ్యంతో ‘రెండు ఆకులు, మధ్యలో మొగ్గ’తో వుండే చివుర్లని యేమాత్రం చెదిరిపోకుండా రెండు చేతుల బొటన వేళ్లకు తగిలించుకున్న యినుప గోర్లతో తుంచి నాలుగడుగుల పొడవు, మూడడుగుల వెడల్పు వుండే వెదురు మక్రీలను తలకి కట్టుకొని వొడుపుగా, వేగంగా దాన్లో వేస్తూ వొక మొక్క తర్వాత, మరో మొక్కకు కదులుతుంటారు. బుట్టలు బరువెక్కుతున్న కొద్దీ యే పల్లంలోంచో యెవరో వో పాటనందుకుంటారు. ఆ పాటతోనే పొద్దు పొడుస్తుంది. వొళ్లంతా పాకుతున్న చెమట చెమ్మని తుడుచుకోకుండానే ఆ పాటని వొక్కొక్కరూ అందుకుంటారు.

మక్రీ నిండగానే ట్రక్కుతో కూర్చొని గుమస్తా దగ్గరకి వెళ్లి తూకం వేయించుకొని, ఆకుని ట్రక్కుల్లో పోస్తారు. ముదిరిపోయిన ఆకుల్ని కూడా కోస్తున్నారు. పుల్లలిరిగి వచ్చేస్తున్నాయ్ అని వంకలు చూపుతూ అరుస్తుంటాడు. మొత్తానికి పొద్దెక్కేసరికి కోత నిలిపేసి, కోసినంత తూకం వేసి ట్రక్కుల్లో వేసి బసకు తిరిగి వచ్చేస్తారు. మధ్యాహ్నం పూట ఆకు తుంచరు. మధ్యాహ్నం మగ కూలీలు తోట అంతా పైపులతో నీరు జిమ్ముతున్నప్పుడు కమ్లిని సన్నని కూనిరాగాలు తీస్తూ వొక కునుకు తీసి సూర్యుడు పడమటకి వాలే ముందు సమయం కోసం చూస్తుండేది. అప్పుడే మళ్లీ ఆకు కోత మొదలవుతుంది. పూర్తిగా చీకటి పడక ముందే మక్రీలని నింపుకొని వెనుదిరుగుతూ ఆ రోజు తను చేసిన పనిని తృప్తిగా చూసుకునేది.

గట్టిగా ఐదు నెలల పాటు కోత వుంటుంది. ఆ తరువాత తాత్కాలిక కూలీలు కొండలు దిగి తమ గ్రామాలకు వెళ్లిపోతున్నప్పుడు 'పని కోసం యెంతెంత ప్రయాణమో కదా' అనుకునేది కమ్లిని. యెస్టేట్ కూలీలు మాత్రం ఆకు పండి, రాలిపోయే వరకు రోజూ చెట్ల ముదురాకుల్ని దూసుకొస్తూనే వుంటారు. కానీ వాటికి యిచ్చే కూలీ చాలా తక్కువగా వున్నా కమ్లిని ఆ పనిని చేసేవారిని చూసి, 'యెక్కువా తక్కువా యేముంది? పని చెయ్యటం ముఖ్యం,' అనుకునేది.

ఆకు పూర్తిగా రాలిపోయాక యిక పనిమంతమైన మగవాళ్ల పని మొదలవుతుంది. 'టీ చెట్టు' అన్ని కొమ్మల్ని యేటవాలుగా చెక్కుతారు. ఆ చెక్కటం చూడటం కమ్లినికి యిష్టం.

''యిలా చెక్కడాన్ని 'ప్రూనింగ్' అంటారు తెలుసా,'' అని వోసారి గోవింద్‌తో అంది కమ్లిని.

ఆ పని సవ్యంగా చేస్తేనే వర్షాలు పడగానే కొత్త రెమ్మలు, కొమ్మలు గుబురుగా వస్తాయి. కోయడానికి అనుకూలంగా వుండే యెత్తులో వుండేట్టు ప్రతీ చెట్టునీ చక్కగా కోసి సిద్ధం చేస్తారు. వారి వెనుకే ఆడకూలీలు చెక్కి పారేసిన కొమ్మల్ని యేరుతుంటారు. కొన్ని యెస్టేట్స్‌లో ప్రాసెసింగ్ వర్క్ కూడా వుంటుంది. ఆ పనికి కొంచెం నిపుణులైన పనివాళ్లని నియమిస్తారు. గ్రేడింగ్, ప్రాసెసింగ్, హీటింగ్ లాంటి పనులు, ప్యాకేజ్, లోడ్ యెత్తడం లాంటి పనులు వుంటాయి.

యిలాంటి పనులున్న అలాంటి వాతావరణంలో ఆ యింటి రెండో కూతురుగా కమ్లిని పుట్టింది. తర్వాత యిద్దరు తమ్ముళ్లు. అమ్మా, నాన్న, అక్క పనికి వెళ్లిపోతే యింట్లో తమ్ముళ్లిద్దరినీ కమ్లినే పెంచింది. మోటారు వదిలినప్పుడు నీళ్లు పట్టుకు రావడం, యిల్లు శుభ్రం చేయడంలాంటి పనులు చేస్తుండేది. పక్క యెస్టేట్‌లోని మిషనరీ స్కూలుకు యిద్దరి తమ్ముళ్లనీ తీసుకొని వెళ్లేది. అలా ఐదవ తరగతి

వరకు కమ్లి చదువుకుంది. ఐదవ తరగతి తర్వాత కమ్లి అక్కకి పెళ్లిచేసి పంపిం చేయడంతో అక్క మక్రీ కమ్లీ నెత్తికెక్కింది. తమ్ముళ్లిద్దరూ చదువుకునేవాళ్లు. మొదట్లో ఆకు తెంచుతున్నప్పుడు వచ్చే వికారపు వాసనకు మొఖం తిరిగి పడిపోయేది. ఆ తర్వాత మక్రీ నిండుతున్నకొద్దీ మెడనరాలు లాగేసి  వెక్కి వెక్కి యేడ్చేది.

అలా తేయాకు కమ్లీ జీవితంలో అలా వో యేడాది కొత్తాకు కోతకు శివగంగ పడమటి కొండల్లోని వో గ్రామం నుంచి వచ్చారు గోవింద్ ముండా కుటుంబం. చాలా హుషారుగా వున్న గోవింద్ ముండా కమ్లీ నాన్నకు నచ్చాడు. గోవింద్ ముండా పాడే భూపెన్ హజారికా పాటలు కమ్లికి నచ్చాయి. ఆ వేసవిలోనే వాళ్లిద్దరికీ పెళ్లి చేశారు. కమ్లిని వయసు అప్పుడు పదహారేళ్లు. శివగంగ తూర్పుకొండల్లోంచి పడమటి కొండ ల్లోని వో కుగ్రామానికి వచ్చింది కమ్లిని. యీ గ్రామస్తులు యెవరూ పూర్తిగా టీ యెస్టేట్ కూలీలు కాదు. యెక్కడ యే పని దొరికితే ఆ పనులు చేస్తుండేవారు. అందరికీ యెంతో కొంత భూమి వుంది. వాటిలో అనాస, కమ్రపెండలం లాంటివి పండించు కుంటూ, దగ్గర కొండల్లో వున్న బొగ్గు తవ్వే ప్రమాదకరమైన పనుల్లోకి వెళ్తూ, యెలక బొరియల్లాంటి కంతల్లోంచి కొండల గర్భంలో వున్న బొగ్గుని తవ్వి పైకి తెచ్చి లారీలను నింపడంలాంటి చాలా ప్రమాదకరమైన పనిని చేస్తుండే వారిని కమ్లిని ఆసక్తిగా చూస్తూ యెక్కువగా గిట్టుబాటు అయ్యే కూలి కోసం ఆ పని చేస్తున్నారని కమ్లిని గ్రహించింది. ప్రతీ యేడూ బొగ్గుపెళ్లలు కూలి వొకరిద్దరు చనిపోతూ వున్నా ఆ పని ఆకర్షిస్తూనే వుందనుకొంది. వొక్క యాభైవేలు కూడబెట్టుకుంటే ఐ.టి.సి.లో వుద్యోగం సంపా దించుకోవచ్చు. ఆపై జీవితం హాయిగా గడిచిపోతుందన్న వాళ్ల ఆశని కూడా ఆమె అర్థం చేసుకొంది. పెళ్లయిన తొలి యేడాది కమ్లి గోవింద్ ముండా కుటుంబంతో కలిసి తేయాకు కోత పనులకు వెళ్లింది.

కొన్నాళ్లకు వాళ్లకి పాపాయి పుట్టింది. కూతురుకు మోని అని పేరు పెట్టుకొని అల్లారుముద్దుగా చూసుకునేవాడు గోవింద్. కూతురు పుట్టాక తాను యెలాగైనా ఐ.టి.సి.లో వుద్యోగం సంపాదించుకోవాలన్న పట్టుదల వచ్చింది గోవింద్‌కు. ఆ యేడాది కమ్లిని యెంత వారిస్తున్నా వినకుండా బొగ్గు పనికి వెళ్లాడు. కానీ యీలోగా యీశాన్య రాష్ట్రాల్లో అల్లర్లు మొదలయ్యాయి. భూమి హక్కు, పౌరసత్వహక్కు, టీ యెస్టేట్‌ల మీద హక్కుల వంటి వుద్యమాలు మొదలై అల్లకల్లోలమై పోయింది. చాలా టీ యెస్టేట్‌లలో పనులు స్తంభించిపోయాయి. బొగ్గు గనులు మూతపడ్డాయి. అప్పుడు యే పనీ దొరక్కుండా పస్తులుండే పరిస్థితి రావడంతో వూళ్లో చాలామంది ఆంధ్రాకు పనుల కోసం వలసపోతుంటే గోవింద్ ముండా కుటుంబం అంతా ఆ పనులకు సిద్ధమయ్యారు.

మోనికి మూడో యేడు కాబట్టి కమ్లిని యింట్లోనే వుంచేశారు. తానూ వస్తానని కళ్లనీళ్లతో పట్టుబట్టినా గోవింద్ కమ్లిని, పాపని బలవంతంగా వుంచేశాడు. అలా వెళ్లిన గోవింద్, మిగిలినవాళ్లు శివరాత్రికి అందరూ తిరిగొచ్చారు. శివగంగా తిరునాళ్లలో కమ్లీతో పాపాయితో మిగిలిన బంధువులతో వుత్సాహంగా తిరుగుతూ చిన్నిచిన్ని బొమ్మలు, ఆభరణాలూ, చెక్కదువ్వెనలూ, బట్టలూ, మిఠాయిలు కొన్నాడు.

ఆంధ్రాలో రైసుమిల్లుల్లో మరో మూడేళ్లు పనిచేస్తే ఐటిసిలో వుద్యోగం సంపాదించుకోవచ్చని గోవింద్ కమ్లికి నచ్చజెప్పాడు. కమ్లికి వొక సెల్‌ఫోన్, తనకొక సెల్‌ఫోన్ కొన్నాడు గోవింద్. వచ్చే శివరాత్రికి మళ్లీ వస్తామని చెప్పి ఆంధ్రాకి వెళ్లిపోయాడు. రోజూ యిద్దరూ కాసేపు మాట్లాడుకుంటుండే వాళ్లు. తమకున్న చిన్న వాలు భూమిలో అనాస, పెండలం పంటల్ని పెంచేది కమ్లిని.

మరో రెండు నెలల్లో శివరాత్రి. శివగంగ లోయలోని శివాలయంలో పూజలు కూడా మొదలయ్యాయి. రోజూ కొండ చివరికెళ్లి బిడ్డనెత్తుకొని నిల్చుని గుడి గోపురపు బంగారపు వెలుతురు వైపు, వూళ్లోకి వచ్చే దారివైపూ చూడటం కమ్లికి రోజువారీ పని అయిపోయింది. యీలోపు ఐటిసి యెస్టేట్‌లో పనిచేసే కూలీలు గుంపులుగా కొండలు దిగి వెళ్లిపోవడం మొదలుపెట్టారు. యెక్కడ చూసినా అలజడి, ఆందోళన. రేడియో వార్తల్లో జాగ్రత్తలు. కోవిడ్ వచ్చి జనం మందలు మందలుగా చచ్చిపోతున్నారని, యెక్కడ వాహనాలు అక్కడ ఆగిపోయాయని, యెవ్వరూ యిళ్లల్లోంచి బయటకు రానివ్వడం లేదని, మాస్క్‌లు పెట్టుకోవాలని... అంతా గందరగోళం. ప్రాణాలు చేతిలో వుగ్గబట్టుకొని భర్త నుంచి వచ్చే కబురు కోసం యెదురుచూస్తోంది. ఫోన్‌లో రీఛార్జ్ అయిపోయింది. యెవరైనా శివగంగకి వెళ్లే వాళ్లుంటే రీఛార్జ్ చేయించమని అడుగుదామంటే యెవరూ కనిపించడంలేదు. అప్పటికి ఐదురోజులుగా గోవింద్ ఫోన్ పలకడం లేదు. యేమైందో అర్థం కావడంలేదు. గుడ్ల నీరు కుక్కుకుంటూ యెదురుచూస్తూనే వుంది కమ్లిని. ఐటిసి యెస్టేట్ వాళ్లు చుట్టుపక్కల వున్న వాళ్లందరికీ బియ్యం, పప్పులు, పిండి నెలకి సరిపడా యిచ్చి వెళ్లారు.

గోవింద్, మిగిలినవాళ్లు వున్న స్థలాన్ని వదిలి వెళ్లటంవల్ల యెంతో అల్లకల్లోల్లం బారిన పడతారని వాళ్లు అనుకున్నారా... కనీవినీ యెరుగని ఆ కల్లోలాన్ని మరచిపోదామన్నా మరపుకి రాదే. యెలా వస్తుంది?

గోవింద్ ముండా ఆంధ్రాకి వెళ్లిపోయాక కూడా కమ్లిని ఐదేళ్ల మోనితో యీ కొండమీద యీ టీ తోటలకి దగ్గరగా తన అత్తగారు పుట్టక ముందు నుంచీ వున్న యింట్లోనే వుండిపోయింది.

విసిరేసినట్టున్న యిళ్లు... భయమన్నదే యెరుగనితనం.

సరిగ్గా యిదిగో యిలాంటి వాన కురుస్తోన్న ఆరోజు తనకెంతో యిష్టమైన కొండ వంపుల్లో వానని చూస్తూ యెండిన పుల్లలు వొకొక్కటిగా మంటలో వేస్తూ వంట చేస్తోంది.

సాయంత్రం మూడే అయింది కానీ దీపాలు పెట్టేంత సంధ్యచీకటి. లైట్ వేస్తోండగా బాధతో మెలికలు తిరిగిపోతూ మోని వచ్చింది.

ఆ పిల్లకి కుట్టింది యేపాటి విషపురుగో చెప్పే పరిస్థితి పిల్లకి లేదు. వో వంక వాన మరో వైపు సూర్యతాపమే లేని మబ్బుకాలం. బాధతో ఉంగలు చుట్టుకుపోతోన్న పిల్లని యెత్తుకొని ఆ వానచీకట్లో వణుకుతోన్న గుండెతో డాక్టర్ దాసుగారి క్లినిక్‌లోకి వచ్చింది కమ్లిని.

గదిలోకి అడుగు పెట్టిన కమ్లినికి ఆ డాక్టర్‌గారు, ''మాస్క్ యేది... ముందు మాస్క్ వేసుకో,'' అంటుంటే మోనిని మోసిమోసి వానలో నానినాని బిగుసుకుపోయిన చేతుల్తో బిడ్డని బల్లపై పెట్టింది కమ్లిని.

డాక్టర్‌గారు అలా డైరెక్ట్‌గా గదిలోకి వచ్చేసిన ఆమెని చూస్తూ యీ కాంపౌండర్ సోనూ యేమయ్యాడా అని టేబుల్ మీదనున్న బెల్‌ని కావాల్సిన దానికంటే గట్టిగా నొక్కాడు.

తన మాస్క్ సరిగ్గా వుందో లేదో చూసుకొంటూ డాక్టర్‌గారు, ''మాస్క్ యేది?'' అని మళ్లీ అడిగారు.

అతను అడుగుతోంది యేమిటో కమ్లినికి అర్థం కాలేదు. చలి... ఆయాసం... ఆదుర్దాతో నోరు పెగలట్లేదామెకి.

ఆ బెల్ మోతకు వొక్క వుదుటున గదిలోకి వచ్చిన సోను తన నోటికి వున్న మాస్క్‌ని చూపిస్తూ కమ్లిని మాస్క్ పెట్టుకోమన్నాడు. అప్పటివరకూ యెటువంటి మాస్క్ పెట్టుకోని కమ్లిని లేదన్నట్టు సైగ చేసింది. మోనీకీ మాస్క్ లేదు.

డాక్టర్‌గారి యెదుటి కుర్చీలో కూర్చుని యిదంతా చూస్తోన్న నీలాక్షి తన బాగ్ లోంచి నీలిరంగు మాస్క్ తీసి కమ్లినికి అందించింది. కమ్లిని అదెలా పెట్టుకోవాలాని అవస్థ పడుతోంటే సోనూ ఆమెకి పెట్టుకోడానికి సాయం చేసి చేతులకి సానిటైజర్ పూసుకున్నాడు.

మోనీకి పెట్టడానికి నీలాక్షి మరొక మాస్క్ యిచ్చింది.

అప్పుడు చూసింది కమ్లినీ నీలాక్షి వైపు కృతజ్ఞతగా. మనసుని తాకేటంతగా ఆ కళ్లు నీలాక్షి మనసులో ముద్రించుకుపోయాయి.

సోనూ మోనీకి మాస్క్ పెట్టాక దాసుగారు, ''యేమయింది?'' అని మళ్లీ అడిగారు.

మాస్క్‌లోంచి తన మాటలు డాక్టర్‌గారికి వినబడతాయో లేదోనని కాస్త శక్తి తెచ్చుకొని పిల్ల యేడుస్తూ వచ్చిన విషయాన్ని అరుస్తున్నట్టే చెప్పింది కమ్లిని.

మారిపోయిన శరీరపు రంగుని ఆ గదిలోని బల్బు కాంతి దాసుగారికి పట్టి యివ్వలేకపోయింది.

వేసేసిన మాస్క్ ఆగిపోయిన నోటి నురగల్ని దాచేసాయి.

చేతికి గ్లవ్స్ వేసుకొని పాప దగ్గరకి వెళ్లిన దాసుగారు క్షణంలో వెనక్కి వచ్చారు.

అట్టకున్న పుస్తకంలో పేజ్‌ని తిప్పి, "పేరేంటి," అడిగాడు సోను.

"కమ్లిని."

"మీ పేరు?" అడిగాడు

"కమ్లిని..."

"మరి పాప పేరు..."

"పాప పేరు మోనీ ముండా."

"నే ముందు అడిగింది పాపపేరే..." కాస్త విసుగు ఆ కుర్రాడి గొంతులో.

"వయస్సు... పాప వయస్సు."

"ఐదేళ్లు."

"ఫీజు."

"ఫీజ్ తీసుకోకు. పాప ప్రాణం పోయింది. పాపని తీసుకెళ్లిపోమను," చెపుతోన్న దాసుగారి వైపు ఆ గదిలోని వారు అయోమయంగా చూశారు.

కమ్లిని కాళ్ల కింద నేల వణికివణికి ఆగిపోయింది.

పిల్లని తీసుకొని గదిలోంచి బయటకు వెళ్లింది కమ్లిని.

"చూసారుగా... యిక్కడ యింకా అంతా మాస్కులు వాడటం లేదు," అన్నారు దాసు.

"యిక్కడ వాటిని యింటింటికి పంచటం లేదా?" అన్యమనస్కంగా అడిగింది నీలాక్షి.

"యెంతకని పంచుతారు? యెక్కడకని పంచుతారు? యీ కొండల్లో మరీ కష్టం. ఆ టీ తోటల వోనర్లే శ్రద్ధ పెట్టాలి," అన్నారు దాసు.

మౌనం.

"నీలాక్షి మేడం... మీరు మాత్రం నే గవర్నమెంట్‌కి వ్యతిరేకంగా మాటాడినవి యేవీ రాయకూడదు మీ పేపర్‌లో. మీరు పరిస్థితి అర్థం చేసుకుంటారని మాటాడుతోన్న..." అని ఆగి నవ్వుతూ, "మీరేమిటి టోకుల్లెక్కన మాస్క్‌లు స్టాక్ పెట్టుకున్నారు," అన్నారు దాసు.

“యింట్లో వాళ్లు అడిగారు. తీసుకొన్న,” అంది నీలాక్షి.

తను రాయాలన్న ఆర్టికల్‌కి కావాల్సిన మేటర్ తీసుకొంటూ వున్నా నీలాక్షి మనసంతా కమ్లిని మీదే వుంది.

యీ వానలో యెంతో ఆదుర్దాగా వచ్చిందామె. పిల్లని పోగొట్టుకొన్న ఆ తల్లి హృదయం యెన్నెన్ని బీటలు వారుతుంటుందో...

దాసుగారికి థాంక్యూ చెప్పి బయటకి వచ్చింది నీలాక్షి.

రెయిన్ కోట్ వేసుకొంటుంటే ఆమెకి ఆ వరండా చివర రెండు చేతులతో తలను పట్టుకొని దుఃఖాన్ని దిగమింగే ప్రయత్నంలో వున్న కమ్లిని కనిపించింది.

వేలాడిపోయిన ఆ చిన్నారి దేహం యింకిపోయిన కన్నీటిబొట్టులా వుంది. తుంచి పారేసిన తేయాకు కొమ్మలా వుంది. ఆడుకుంటున్న పిల్లల చేతిలో బొమ్మలా వుంది. కొండచిలువ మింగేసిన చందమామలా వుంది. ఆ దృశ్యం చూడగానే వొక్క క్షణం నీలాక్షి కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. బిడ్డని వొళ్లో పడుకోపెట్టుకొని, యెడమ చేత్తో నిస్సహాయంగా తలని పట్టుకొని కూర్చున్న కమ్లినిని చూసింది. గట్టిగా గుండెలు పగిలేలా రోదించటం లేదా తల్లి. మాన్పడిపోయినట్టు, నిద్రిస్తోన్న బిడ్డని గుండెల్లో పొదువుకొని కూర్చున్నట్టు, జాగ్రత్తగా బిడ్డకి యెక్కడ తెలివి వస్తుందేమోనని నిశ్చలంగా, బొమ్మలా కూర్చుని వుంది కమ్లిని.

వొక్క వుదుటున నీలాక్షి ఆమె దగ్గరకి చేరి ఆమె వొళ్లోని పసిబిడ్డ దేహాన్ని తన చేతుల్లోకి తీసుకొని భుజం మీద వేసుకొంది. బిడ్డతోపాటు కమ్లిని కూడా అప్రయత్నంగా లేచి నిలబడింది. నీలాక్షి మరో చేత్తో కమ్లినిని పొదివి పట్టుకొంది. అప్పటిదాక అదిమిపట్టుకున్న దుఃఖం వొక్క సారిగా పెల్లుబికినట్టు ‘అయ్యో.. మోనా నాతల్లీ ‘ అంటూ కమ్లిని రోదించటం మొదలుపెట్టింది. ఆ దుఃఖపు దృశ్యాన్ని చూడటం యెవరి తరం కావటం లేదు. నీలాక్షి కమ్లినిని మరింత దగ్గరకి లాక్కుని వోదార్చటం మొదలుపెట్టింది.

ఆ చిన్ని వరండాలో వున్న మరికొద్ది మంది పేషెంట్స్ ఆమెకి దూరంగా నిలబడి కూర్చున్న వారు లేచిన చోటే నిలబడి కమ్లినిని చూస్తూ, ‘ప్చ్.. యిదేమి పాడుకాలమో దగ్గరకి వెళ్లే పరిస్థితి కూడా లేదు,’ అని దిగులుపడ్డారు.

నీలాక్షి కమ్లిని వీపు నిమురుతూ, “మీతో మీవాళ్లెవ్వరూ రాలేదా?” అని అడిగింది.

“యెవరున్నారు రావడానికి,” అని బెక్కుతూ అంది కమ్లిని.

“అంటే...”

“మా యింటాయన పనికని ఆంధ్రా పోయిండు. మా అత్తామామ అక్కడే యేడనో పొలంలో కట్టిన బంగాళాని చూసుకోడానికి కావాలంటే వాళ్లూ వెళ్లిపోయారు. మరిదిగారు, మరిది పెళ్లాం మా ఆయన పనిచేస్తోన్న వూర్లో పనుందని పోయారు పోయినేడాది ఆకుతుంపేక, మళ్లీ యీ యేడాది ఆకు తుంపే టయానికి వస్తామని. యిక్కడున్న ఆ యిల్లు చూసుకొంటూ నేనీ పిల్లతో వున్నాను. యిప్పుడీ పిల్లా వెళ్లిపోయింది,” మళ్లీ భోరున యేడిచింది కమ్లిని.

”అయ్యో... యిప్పుడెలా... యిల్లు యెంత దూరం,” అడిగింది నీలాక్షి.

“ఆ టీ యెస్టేట్ చివరనున్న కొండమీద వూరిలోకి,” చెప్పింది కమ్లిని.

అక్కడికి వెళ్లటానికి నడవటం తప్పా యే వాహనం వెళ్లే అవకాశం లేదు.

యీ చీకట్లో, యీ వానలో యీ పిల్లని తీసుకొని యీ తల్లి యింటివరకూ యెలా వెళ్లుతుంది?!

మరికాసేపట్లో యీ క్లినిక్ కూడా మూసేస్తారు.

“మీవాళ్లకి కానీ తెలిసిన వాళ్లెవరికైనా ఫోన్‌చేసే అవకాశం వుందా?” అడిగింది నీలాక్షి.

“మా ఆయన ఫోన్ కలవటంలేదు.”

“అతను యిప్పుడు అంత దూరం నుంచి రావడానికి వీలుకాదు. రైళ్లు లేవు. విమానాలూ లేవు. యిప్పుడు యీ రాత్రికి మీ యింటికి వెళ్లాలి కదా. యెలా వెళ్తావు?! యెవరో వొకరి సాయం లేకుండా,” అంది నీలాక్షి.

“తెలిసిన దారేగా... యెలాగోలా మోసుకుపోతా... యీ వాన పొద్దు యెవరొస్తారు... తాగి పడుకొని వుంటారు మగాళ్లు. తాగనోళ్లు రెండు కొండల మలుపుల అవతల చాలా దూరాన వున్నారు. రాలేరు. ఆడవాళ్లు రాలేరు. నేనే మోసుకుపోతా,” అంది కమ్లిని.

నీలాక్షి తన ఆఫీస్‌లో తనతోపాటు పనిచేసే జర్నలిస్ట్ మిత్రుడు అముల్యాకి కాల్ చేసి విషయం చెప్పింది. ఆ యేరియాలో తెలిసిన వాళ్లు యెవరున్నారో చూస్తానన్నాడు.

యింతలో సోనూ బయటకి వచ్చాడు.

“యీ పాపని వాళ్ల యింటి వరకు చేర్చేవాళ్లు యెవరైనా దొరుకుతారా,” అని అడిగింది నీలాక్షి.

“యీ వానలోనా...?!!” అంటూ అతను నసుగుతుంటే, “కాస్త యెవరినైనా చూడు. దానికి అయ్యే మనీ యిద్దాం,” అంది నీలాక్షి.

ఆ కుఱ్రవాడు వెళ్లి వో ముగ్గుర్ని తీసుకొచ్చాడు. అవసరం అయినప్పుడు పేషేంట్స్‌ని కొండల మీదనున్న యిళ్లకి, యిళ్ల నుంచి ఆసుపత్రికో తీసుకొని వెళ్లే వాళ్లు.

వాళ్లు నీలాక్షిని చూసి మూడు వేలు అడిగారు.

''మూడు వేలా?!'' ఆశ్చర్యంగా అడిగింది నీలాక్షి.

''వాన... చీకటి... పిల్లని తీసుకొని వెళ్లాలి,'' అన్నారు.

మామూలుగా అయితే వాళ్లు తీసుకునేది వందో రెండొందలో.

యిప్పుడు వీళ్లూ వెళ్లిపోతే కమ్లిని వొంటరిదైపోతుంది. మోనిని యెలా తీసుకు వెళ్లుతుంది?!

నీలాక్షి దగ్గర అంత క్యాష్ లేదు.

''గూగుల్ పే వోకే నా,'' అని అడిగింది.

వాళ్లు గూగుల్ పే లేదన్నారు. సోనూ తన దగ్గరుంది, తనకి పంపితే వాళ్లకి క్యాష్ యిస్తానన్నాడు.

సోనూకి డబ్బులు పంపింది.

కమ్లినికి ఖర్చులకి వుంచమని తన దగ్గర వున్న పదిహేను వందలు యిచ్చి ఆమె నెంబర్, గోవింద్ నెంబర్ తీసుకొంది నీలాక్షి. గోవింద్ నెంబర్ని అముల్యాకి పంపింది. గోవింద్‌ని కాంటాక్ట్ చెయ్యమని చెప్పింది.

'యింత ఆందోళనగా, ఆదుర్దాగా, వేదనగా సాగిన సాయంకాలం యెప్పుడూ తన అనుభవంలోకి రాలేదు,' అనుకొంది నీలాక్షి.

* * *

నీలాక్షి యింటికి వచ్చేసాక కూడా గోవింద్ కాంటాక్ట్ దొరకలేదు.

మూడు రోజుల తరువాత మధ్యాహ్నంకి గోవింద్ ఫోన్ కలిసింది. అతనికి దగ్గు వస్తుంటే క్వారెంటైన్‌కి పంపిస్తే, అక్కడ వాళ్లు టెస్ట్‌కి పంపారంట. టెస్ట్ రిపోర్ట్ నెగిటివ్ వచ్చిందంట. యీ రోజే పనిచేసే చోట తమకిచ్చిన రూమ్ దగ్గరకి వచ్చాడంట. క్వారెంటైన్‌కి వెళ్లే రోజే ఫోన్ రీ ఛార్జ్ అయిపోయిందంట. యిప్పుడు వచ్చాక రీచార్జ్ చేయించుకొన్నాడంట. గోవింద్‌ని కమ్లినితో మాటాడమని చెప్పాడు అముల్యా.

గోవింద్ కమ్లినికి కాల్ చేసాడు. ఆమె మోని పోయిన విషయం చెప్పి భోరుమంది. అతనూ దుఃఖపడ్డాడు.

నువ్వేమైపోయావని బెంగగా అడిగింది. నిజంగానే నీ ఆరోగ్యం బాగుందాని గోవింద్‌ని తిరిగి తిరిగి ఆరా తీసింది. నీ కడసారి చూపుకి పిల్లని వుంచడానికి వీలు

కాలేదని యేడిచింది. పిల్లని బయటకు యెందుకు తిరగనిచ్చావని కాసేపు కమ్లిని మీద నిస్సహాయంగా గోవింద్ అరిచాడు.

*   *   *

"నువ్వక్కడుండొద్దూ వచ్చై," అని గోవింద్‌ని పదేపదే అడిగింది కమ్లిని.

"యిక్కడంతా మూసుకుపోయింది. పనిలేదు. యెవరినైనా యెలా వెళ్లాలని అడగాలంటే భాష రాదు. యజమాని ఫుడ్‌కి అన్ని యేర్పాట్లూ చేసారు," అన్నాడు గోవింద్.

కానీ యిక్కడుంటే యే క్షణానన్నా పోతే దిక్కూమొక్కూ లేదు. అమ్మావాళ్ల ఫోన్ కలవటం లేదు. రీ చార్జ్ చేయించటం కూడా కష్టంగానే వుంది. మనవాళ్లు అంతా కలవగానే యేదో వొక ట్రక్కో బండో తీసుకొని వచ్చేస్తాం..." చెపుతూనే వున్నాడు గోవింద్.

*   *   *

అమూల్య తెలిసిన జర్నలిస్ట్‌లతో కోఆర్డినేట్ చేసాడు గోవింద్‌ని యెలాగైనా పంపటం అవుతుందేమోనని. వాళ్లు లోకల్ అధికారులతో మాటాడారు. యేమైనా బళ్లు తిరగడానికి అనుమతి వస్తే పంపుతాం అన్నారు. చూసిచూసి అసహనం, నిరాశ, భయాందోళనలతో గోవింద్ తన తల్లితండ్రులతో, తమ్ముడు మరదలతో, తన తోటి వారితో మాటాడుకొని అంతా కలిసి దొరికిన ట్రక్కో బండో పట్టుకొని వెళ్లిపోదామనుకున్నారు. చివరికి నడవటానికి సిద్ధమైపోయారు. దొరికితే యేదో వొక ట్రక్ యెక్కారు కొంత దూరం. నడుస్తూనే వున్నారు రోజుల తరబడి. రోడ్డు అంచునే చాలా దూరం నడిచి నడిచి రోడ్డు మధ్యకి యెప్పుడు వచ్చేసారో తెలీనే లేదు.

నడిచి నడిచి వచ్చిన తన వాళ్లని చూసి కమ్లిని బెంబేలెత్తిపోయింది.

ఆ పాదాలు చెదిరిన కలల్లా వున్నాయి. ఆ పాదాలు చితికిన ఆశల్లా వున్నాయి. ఆ పాదాలు చిదిమేసిన శ్వాసలా వున్నాయి.

వెళ్లిపోయిన పిల్లని యెందుకిలా చేసావని అడగటానికి తను కొలిచే శివయ్యో స్వామో వున్నారు, కానీ వీళ్లని యింతగా యెందుకలా పాదాలు అరిగిపోయేట్టు నడిపించావని అడగడానికి యెవ్వరూ లేరు. ఆ లేనితనం చూసి వోటైడానికి నిలబడిన కాలం వెక్కిరిస్తోంటే కమ్లిని శూన్యంగా నిట్టూర్చింది.

వూరి కాని వూరు. భాష రాదు. పనీ కొత్తే. వొకటా రెండా దాదాపు మూడువేల కిలోమీటర్ల పైన నడక. యెన్ని నదులు, యెన్నెన్ని కొండలూ... అడవులూ... అబ్బో తలచుకొంటేనే ఆ నడిచొచ్చిన పాదాలకి నమస్కరించాలనిపించింది కమ్లినికి. రోజూ

నూనె రాసి, కాపడం పెట్టి గోవింద్‌ని తిరిగి మునుపటిలా చెయ్యడానికి ఆమెకి చాలా సమయం పెట్టింది.

* * *

లాక్‌డౌన్ వల్ల తేయాకు కోసే పని ఆపేశారు. చేతిలో యేమన్ని డబ్బులూ లేవు.

కొండల్లోకి పోయి గుమ్మడి ఆకులు, పెండలం దుంపలు తీసుకొచ్చేది. తిండికి కొరత లేకుండా యిల్లు గడుపుతోంది. గోవింద్‌కి పనేంలేక లాక్‌డౌన్ తీసేసాక మళ్లీ వెళ్దామా పనికనే ఆలోచన మధ్య మధ్యలో చేస్తున్నాడు. యెన్నాళ్లు వున్నా పరాయి చోటు పరాయిదే. యింత కష్టం చేసి తాము సంపాదించింది యెంత?! యేమి మిగిలింది?!

అంత దూరం కాకపోయినా గౌహతీ వెళ్లితే అనే ఆలోచనా చేశాడు.

పట్నం జీవితంపై అతనికి పూర్తిగా భ్రమలు తొలగిపోలేదు. యిదంతా యెప్పటి కొప్పటికి సర్దుకొంటుంది. మళ్లీ ఆ సంపాదించే మంచి రోజులు వస్తాయనే వో సుఖమైన కలని అతను కంటూనే వున్నాడు.

వొక నిర్లిప్తత. అంతలోనే దిగులు. తిరిగి వచ్చిన వాళ్లలో కొందరు కొంత నిరాశకి గురవుతోన్నా తిరిగి వూరుతోన్న అస్పష్టమైన ఆలోచనలతో వున్న గోవింద్‌తో, "నిరాశగా వున్నా, బెంగగా వున్నా మళ్లీ యీ వూరు దాటిపోనియ్యను నిన్ను. నిలువెత్తు ముంచే ఆకలి అయితే లేదుకదా..." అంది కమ్లిని.

* * *

నీలాక్షి కమ్లినికి కాల్ చేసింది.

"యేమి చేస్తున్నావ్."

"వంటైంది యిప్పుడే. మోనీ సైకిల్ బెల్ మోగటం లేదు కదా... కొత్త బెల్ వేస్తోన్న. మీరొచ్చి చాల రోజులయింది," అంది కమ్లిని.

"వానలు ఆగటంలేదు. లాక్‌డౌన్‌లో హెల్ప్ చేసే పనులు. వస్తాను రేపు," చెప్పింది నీలాక్షి.

"రేపు ఆకు తుంపటానికి పోతున్నా. తుంపుతామో ప్లకార్డ్స్ పట్టుకొని కూర్చో మంటారో. రోజు కూలీ పెరిగితే కాస్త బాగుంటుంది. అక్కడికి వస్తారా."

"వస్తాను," అంది నీలాక్షి.

* * *

నీలాక్షి టీ యెస్టేట్ దగ్గరకి వెళ్లింది.

కమ్లిని నీలాక్షిని చూసి సంబరంగా నవ్వుతూ ఆమడ దూరంలో నిలబడి తన టీ మగ్రీ ముందుకు తెచ్చి యిద్దరి మధ్యా దూరాన్ని చూసి మరికొద్దిగా వెనక్కి జరిగి చిక్కని ముదురాకుపచ్చ తేయాకుని నీలాక్షికి యిస్తూ, "రంగు మారిన కొత్తాకు," అంది.

తేయాకు స్వేదంతో పండిందో, మంచు తేమతో నిండిందో తెలియదు కానీ లేత యెరుపుని నింపుకొన్న నునులేత ఆకుపచ్చటి ధగధగ యెన్ని వేళ్ల స్పర్శని తాకిందో, యెన్ని నాలుకల్ని తాకనుందో సంధ్య వెలుగుల్లో లేత, ముదురాకు. తళతళలాడుతున్న ఆ ఆకు రంగుకి ముచ్చట పడుతూ, "థాంక్యూ," అంది నీలాక్షి.

చెట్లపై వాలిన చిలకలేవో యెన్నో విషయాలు చెపుతున్నట్టనిపించాయి.

"బిక్కుబిక్కుమంటూ గడిపిన రోజులు కళ్ల ముందు తిరుగుతున్నా వొంటరిగా అనిపించటం లేదు... అందరూ కలిసి వుండటం బాగుంది. ముఖ్యంగా మా గోవింద్ వుండటం మరీ బాగుంది," అంది కమ్లిని.

"విస్తృత భూమి యిది. శాపగ్రస్త భూమి యిది. వలసల భూమి యిది. అలజడుల భూమి యిది. అల్లకల్లోల భూమి యిది. జాతుల నెత్తురుతో నిరంతరం తడుస్తూనే వున్న భూమి యిది. ప్రభుత్వాల రక్తదాహానికి నిరంతర సాక్షిగా నిలిచే నిత్య స్మశాన భూమి యిది. యీ పరిస్థితి మారాలి. యీ భూమి బతుకుని హామీ యివ్వాలి. యికపై యిక్కడనుంచి యెలాంటి వలసలూ వుండకూడదు. వియోగాలు, దుఃఖాలు రక్తపాతాలూ వుండకూడదు. ప్రతి యేడాది తేయాకు చెట్టుని నరికి మరుగుజ్జుని చేస్తున్నట్టుగా యికపై యిక్కడి జీవితాలు యే మాత్రం కుదించపడకూడదు. రాబోయే తరాలనైనా ఆకాశాన్ని అంటే మహావృక్షాల్లాగ స్వేచ్ఛగా యెదగనివ్వాలి. యీ జ్ఞానం, మేలుకోలుపూ ప్రతి వొక్కరిలో కలిగేలా యీ పోరాటం కొనసాగాలి. మనపై యీ అణిచివేత సామాజికమైనది కాదు. మానసికంగా మనల్ని దుర్బలుల్ని చేసే అణిచివేత యీ వలస. యీ వలసలతో వొక్కసారిగా మన దరిద్రాలన్నీ చుట్టుముట్టి భయంగొలిపే నిశ్శబ్దం మన నట్టింట్లో. మనల్ని మనం తిరిగి నిలబెట్టుకోవడానికి మనల్ని మనం అన్వేషించుకోడానికి మన మూలాలవైపు సుదీర్ఘమైన నడక మొదలు పెట్టాం," అనుకొంటూ నీలాక్షి తన చేతిలోని తేయాకుని చూస్తోంది.

"కొద్ది రోజుల క్రితమే మళ్లీ దూరదూరంగా నిలబడి మాస్క్ వేసుకొని తేయాకు కొయ్యమని పిలిచారు. అంతలోనే వేతనాలు పెంచమని అంతా ప్లకార్డ్స్ పట్టుకొని కూర్చోమన్నారు. రోజు కూలీ పెరిగితే కాస్త బాగుంటుంది కదా. అందుకే లొంగిపోకూడదనుకొంటున్నాం," అంది కమ్లిని.

నీలాక్షి తను తీసుకొచ్చిన సి విటమిన్ టాబ్లెట్స్, హార్లిక్స్ బాటిల్ యిస్తూ కమ్లి వైపు చూసింది. ఫేడౌట్ అవుతోన్న దృశ్యంలా దిగులంతా మాయమైపోయి వొకప్పటి ఆ వైభవమంతా మిలమిలలాడుతోంది ఆమె బుగ్గల్లో. ఆమె కళ్లలో ముసురుకొన్న దిగులు మేఘాలేవో కరిగిపోతూ వాటి స్థానే ఆ కళ్లల్లో వొక పట్టుదల కనిపిస్తోంది. తన చుట్టూ కొంత సందడి సృష్టించుకోవాల్సిన అవసరం మరోసారి కలిగింది కమ్లినికి.

కొత్త వుత్సాహం. వో కొత్త జీవానికి మళ్లీ వూపిరి పోస్తోన్న తృప్తి. వో తమదైన వలసలు లేని, యెడబాటు లేని వో కొత్త జీవితంలోకి అడుగెయ్యబోతోన్న ఆత్మ విశ్వాసపు కొత్త వెలుగు. వో కొత్త సృష్టించబోతోన్న తల్లి ఆనందం కమ్లిని ముఖంలో. వో కొనసాగింపుకి బీజం వేసిన లేతతేయాకు మొగ్గ ఆకుగా విచ్చుకొన్న గర్వం ఆమె పెదవులపై.

వొక మహా విపత్ కాలంలో యెదురైన విషాదం మీదుగా నడుస్తోన్నప్రపంచాన్ని గత కొంతకాలంగా ప్రతిరోజు చూస్తూ వాటిని రికార్డ్ చేస్తోన్న నీలాక్షి కళ్ల ముందు తళుక్కుమంటూ విప్పారిన కమ్లిని ముఖం ఫ్రెష్‌గా... అప్పుడే పరిమళభరితమవుతోన్న వానకాగిన తేయాకు తోటల వెచ్చని టీలా... రిఫ్రెష్... చాలారోజుల తరువాత కుంభ వృష్టి మేఘాలు పక్కకు తప్పుకొని బ్రహ్మపుత్ర అలల సవ్వడిని తాకి పరుచుకోనిస్తోన్న వుదయపు లేతవెచ్చదనం. యెన్నాళ్లయిందో యిటువంటి ప్రభాతరశ్మి విచ్చుకొని...!!!

*మాతృక మాసపత్రిక*
*ఆగస్ట్ 2020*

*




కుప్పిలి పద్మ మొదటి కథ మానసికం 1989 ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చయింది. 120 కథలు తొమ్మిది కథాసంపుటాలుగా- మనసుకో దాహం, ముక్త, సాలభంజిక, మంచుపూలవాన, ద లాస్ ఆఫ్ యిన్నోసెన్స్, వాన చెప్పిన రహస్యం, మంత్రనగరి సరిహద్దుల్లో, పొగమంచు అడివి, కుప్పిలి పద్మ కథలు ప్రచురించారు. మూడు నవలలు, ఒక కవితాసంపుటి ప్రచురించారు.

**ఫోన్: 98663 16174** **kuppilipadma@gmail.com**